ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విజేత ఎవరో ?

- నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభం
- ఎయు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఏర్పాట్లు
- 'తొలి ప్రాధాన్యం' దక్కితే సాయంత్రానికే ఫలితం



ఎయులోని కౌంటింగ్ కేంద్రం



విజయగౌరి



రఘువర్మ



శ్రీనివాసుల నాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఫలితం సోమవారం తేలనుంది. నరాలు తెగే ఉత్కంఠకు నేటి సాయంత్రంతో తెరపడనుంది. మండలి ఎన్నికల్లో విజేత ఎవరన్న అంశంపై ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొద్ది రోజులుగా విపరీత చర్చ నడుస్తోంది. ఫలితం కోసం ఎదురుచూసే వారిలో ఉపాధ్యాయులే కాకుండా సాధారణ ప్రజానీకమూ ఉన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదిక కానుంది. గత నెల 27న ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగ్గా 20783 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.

లెక్కింపు ప్రక్రియ ఇలా..

ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ట్రిపుల్ ఇ విభాగం భవనాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు దశల్లో సాగే లెక్కింపు ప్రక్రియ పూర్తయి విజేత పేరు ప్రకటించేందుకు 8 నుంచి 10 గంటల సమయం పడుతుందని ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. లెక్కింపు ప్రక్రియలో తొలుత అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లు తొలగించి, బ్యాలెట్ బాక్సులను లెక్కించి హాల్లోకి తరలిస్తారు. 123 బ్యాలెట్ బాక్సుల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. తొలిదశలో బాక్సుల్లో ఓట్లను ఆరు రౌండ్లలో వెలికితీసేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టనున్నట్టు తెలుస్తోంది. రెండో దశలో పోలైన ఓట్లను 25 చొప్పున కట్టలు కడతారు. అలా వెయ్యి ఓట్లను ఒక పెద్ద డ్రమ్ములో మిగతా 2లో..

ప్రధాన పోటీ ఆ ముగ్గురి మధ్యే !

పది మంది మండలి బరిలో ఉన్నా ప్రధానమైన పోరు యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, బిజెపి మద్దతునిచ్చిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, టిడిపి, జనసేన మద్దతునిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మధ్యనే నెలకొంది. పోలింగ్ జరిగిన తర్వాత వచ్చిన వార్తల ప్రకారం.. రఘువర్మను గెలిపించుకోడానికి అధికార పార్టీ నాయకులంతా ఉత్తరాంధ్ర అంతటా పలు అక్రమ పద్ధతులకు పాల్పడడం ఉపాధ్యాయుల్లో వ్యతిరేకతను పెంచేలా చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన పిడిఎఫ్ అభ్యర్థి పట్ల గురువులు మక్కువ చూపినట్టు చర్చ సాగుతోంది. గడిచిన తొమ్మిది నెలల పాలనా కాలంలో గురువుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి కొనసాగడం అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి రఘువర్మకు నెగెటివ్ అయ్యిందన్న మాటలు వినిపించాయి. పిఆర్‌టియు నుంచి నిలబడి బిజెపి మద్దతు పొందిన గాదె తరుపున సొంత సంఘమే కాకుండా ఒకటీ అరా సంఘాలు పనిచేశాయని, ఈ నేపథ్యంలో ఆయనా రేసులో ఉన్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఇంకొన్ని గంటల్లో విజేత ఎవరో తేలనుంది.

శివరాత్రి ప్రత్యేక బస్సుల ఆదాయం రూ.2 కోట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల ద్వారా సంస్థకు విశాఖ జిల్లాలో రూ.2 కోట్ల మేర ఆదాయం వచ్చిందని, ఇది గత ఏడాది కంటే రూ.20 లక్షలు అధికమని ఎపిఎస్ ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (జోన్ - 1) ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన సంస్థ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడుతో కలిసి మధురవాడ డిపోను తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించి మరింత మెరుగైన సేవలు ప్రజలకు ఇవ్వాలని, బస్సుల నిర్వహణ బాగుండాలని అన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. శివరాత్రి ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా సంస్థ అధిక ఆదాయం సాధించిందని పేర్కొంటూ అందుకు సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు.

ఈ నెల 5, 6 తేదీలలో గీతం కాలేజీలో జరగనున్న జాబ్ మేళాకు అభ్యర్థులు వేల సంఖ్యలో హాజరయ్యే వీలుందని, ఆ రద్దీకి అనుగుణంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి గీతం కాలేజీకి ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వరి, ట్రాఫిక్ సూపర్‌వైజర్ దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో కెజిహెచ్ సిబ్బంది ప్రతిభ
వార్త 4లో..

అటవీ సంపద రక్షణకు ప్రత్యేక చర్యలు
వార్త 2లో..

విశాఖలో బైక్ రేసర్లపై కొరడా
వార్త 2లో..



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సురేంద్ర, సూర్యనారాయణ, మోహనరావు

జీడి మామిడికి మద్దతు ధర ప్రకటించాలి

17న ఐటిడిఎ, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం వార్త మెయిన్‌లో..

నివేదికలో డొల్లతనం

- సాహితీ ఫార్మా ప్రమాద ఘటనపై స్పష్టత లేమి
- వాస్తవాలు విస్మరణ
- యాజమాన్యాన్ని రక్షించే యత్నం
- సెజ్‌లో ఆగని ప్రమాదాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు ఆగడంలేదు. యాజమానులు నిలువరించే జాగ్రత్తలు తీసుకోవడంలేదు. ప్రభుత్వ యంత్రాంగం నిబంధనలను కఠినతరంగా అమలుచేయడంలేదు. లోపభూయిష్టమైన పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రమాదనంతరం చేసిన విచారణ వాస్తవాలు బయట పెట్టడంలేదు. విచారణ నివేదికలోని విషయాలు యాజమానులను రక్షించేలా వున్నాయి తప్పితే ప్రమాద వాస్తవాలను వివరించడంలేదు. ఆ విమర్శలకు బలం చేకూరేలా ఇటీవల వెలుగుచూసిన సాహితీ ఫార్మా ప్రమాద నివేదిక వుంది. 2023 జూన్ 30న ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన ప్రమాదంపై విచారణకు కలెక్టర్ కమిటీని



సాహితీ ఫార్మాలో ఎగసిపడుతున్న మంటలు (ఫైల్ ఫొటో)

నియమించారు. ఆ కమిటీ నివేదిక కోసం 2024 ఫిబ్రవరిలో సమాచార హక్కు చట్టం కింద మానవ హక్కుల వేదిక దరఖాస్తు చేసిన ఏడాదికి 2025 ఫిబ్రవరి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విజేత ఎవరో ?

వేస్తారు. ఈ మేరకు మరో 2 గంటల సమయం పడుతుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత మూడో దశగా అభ్యర్థులకు పోలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లకు ఒకటి కలిపి అందులో 50 శాతం ప్లస్ 1 ఓట్లు వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అంటే ఉదాహరణకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 20 వేలు చెల్లుబాటయితే.. వాటికి ఒక ఓటు (20,001) కలుపుతారు. అందులో 50 శాతం ప్లస్ 1 అంటే... విజేతకు 10,001 ఓట్లు రావల్సి ఉంటుంది. అలా తొలి ప్రాధాన్యత ఓట్లు 10,001 వస్తే విజేత పేరును వెంటనే ప్రకటిస్తారు.

తొలి ప్రాధాన్యతతో విజేత తేలకపోతే..

తొలి ప్రాధాన్యతా ఓట్లలో విజేత తేలకుంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అప్పుడు పోటీ చేసిన అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన వారి నుంచి ఎలిమినేషన్ రౌండ్ ఆరంభమవుతుంది. ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్తే పూర్తి ఫలితం వచ్చేసరికి 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని, ఈ లెక్కన సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల్లోపు విజేత పేరు ప్రకటించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోలింగ్ జరిగిన తీరు, బరిలో నిలిచిన వారిలో త్రిముఖ పోటీ నెలకొనడంతో మొదటి ప్రాధాన్యతా ఓట్లుతో విజేత ప్రకటన సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఏమైనా ఇబ్బందులు ఎదురైనా, ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి వచ్చినా ఫలితం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఒక వేళ తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజేత ఎవరో తేలితే.. సాయంత్రం 4 గంటలకే ప్రక్రియ పూర్తవుతుంది.



కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సాహితీ ఫార్మా ప్రమాద క్షతగాత్రులు (ఫైల్ ఫొటో)

నివేదికలో డొల్లతనం

చివరిలో పది పేజీల నివేదిక అధికారులు పంపించారు.

అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా ప్రమాద నివేదికలో స్పష్టతలేదని 'ప్రజలు కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు తెలిపారు. పది పేజీల నివేదిక రాయడానికి ఏడాది కాలం తీసుకున్న విచారణ కమిటీ వివిధ శాఖల ప్రథమ దర్యాప్తును జోడించింది తప్ప ప్రమాద కారణాలను స్పష్టంగా చెప్పలేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రమాదం ఎందుకు జరిగింది ? ఎలా జరిగింది ? అనేది నివేదికలో పేర్కొనలేదు. ప్రమాద కారణాలు పొందుపర్చలేదు. ప్రమాదం పునరావతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన వివరణ ఇవ్వలేదు. తమ బాధ్యతను విస్మరించి, యాజమానులను రక్షించడానికి తయారుచేసినట్లు నివేదిక వుందని విమర్శలొస్తున్నాయి. కమిటీ సభ్యులు వారి అవగాహన ప్రకారం నివేదిక తయారుచేసినట్లుంది తప్పితే శాస్త్రీయంగా ప్రమాద వాస్తవాలను విశ్లేషించి వివరించలేదు. పీడన పెరుగుదల లెక్కలలో ప్రాథమిక విషయాలను విస్మరించారు. 'మూడు వేల లీటర్ల డై మిథైల్ సల్ఫాక్సైడ్ (డిఎంఎస్ఒ) కాలడానికి కనీసం 22 టన్నులకుపైగా గాలి కావాలి. అంత గాలి స్వల్ప సమయంలో ఎలా కంపెనీలోకి చేరిందనేది వివరించలేదు. ఆరు టన్నుల బరువుగల ట్యాంక్ 70 మీటర్ల దూరంలో పడే శక్తి మంటకు రాదు, విస్ఫోటనంతోనే అలా జరుగుతుంది. కానీ ఈ విషయాన్ని కమిటీ తన నివేదికలో చెప్పలేదు. పసలేని నివేదికకు అంత గోప్యత, ఏడాది కాలం అవసరమా ?' అని బాబూరావు ప్రశ్నించారు. ఎన్‌జిటిలో కేసు నడుస్తుండగా వచ్చిన ఈ నివేదికను సమర్పించకుండా తొక్కిపెట్టారు.

అసెన్షియా విషయంలో ఇలా..

అచ్యుతాపురం సెజ్‌లోని అసెన్షియా ఫార్మాలో 2024 ఆగస్టు 21న జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మృతిచెందగా, 38 మంది గాయపడ్డారు. 22న కంపెనీ ప్రమాద ఘటనను పరిశీలించిన సిఎం చంద్రబాబు నాయుడు పరిశ్రమల ప్రమాదంపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తామని ప్రకటించి కొంతకాలానికి నియమించారు. ప్రమాద లోపాలపై కమిటీ నివేదిక సమర్పించిన తరువాత చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాదం జరిగిన నెల రోజుల తరువాత విశ్రాంత ఐఎఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలో కమిటీని నియమించారు. ఆ కమిటీ రెండు నెలల్లో నివేదిక సమర్పించాల్సివుండగా ఇంతవరకూ ఆ నివేదిక ఏ స్థాయిలో వుందో చెప్పేవారే కరువయ్యారు. మరోపక్క పరిశ్రమల్లో ప్రమాదాలు యథాతథంగా జరుగుతున్నాయి. తాజాగా శుక్ర, శనివారాల్లో పరవాడ ఫార్మా సిటీలోని అపిటోరియా యూనిట్-6, అచ్యుతాపురం ఎవరెక్స్ డ్రగ్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు.

జెవి సత్యనారాయణమూర్తి అరెస్టు దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అరెస్టు పోలీసుల తొందర పాటు చర్య అని భారత నాస్తిక సమాజం కేంద్ర కన్వీనర్ జె.రవి, నాయకులు టి.శ్రీరామమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల విషవాయువులు లీకై వందలాది మంది అస్వస్థతకు గురికావడమే కాకుండా పలువురు ప్రాణాలు కోల్పోయారని, వారికి న్యాయం చేయాలని సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనలో జెవి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రమంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారంటూ అప్పట్లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ కేసు విషయమై సత్యనారాయణమూర్తిని స్టేషన్‌కు పిలిపించి అరెస్టు చేయడం, తర్వాత రిమాండ్‌కు పంపించడం పోలీసులకు తగదన్నారు. బాధ్యతాయుత నాయకునిగా ఉన్న ఆయనకు కనీసం రీకాల్ పిటిషన్ వేసుకునే సమయం కూడా లేకుండా శని, ఆదివారాలు కోర్టుకు సెలవులు అని తెలిసి రిమాండ్‌కు తరలించడం పట్ల ఆవేదన వ్యక్తపరిచారు.

అటవీ సంపద రక్షణకు ప్రత్యేక చర్యలు

'ప్రజాశక్తి'తో జిల్లా అటవీ శాఖ అధికారి శామ్యూల్





ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలో అటవీ సంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా అటవీ శాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. అటవీ విభాగంలో జరుగుతున్న అభివృద్ధి, నర్సరీల ఏర్పాటు వంటి అంశాలను ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో అటవీ సంపద వివరాలు తెలపండి ?

జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం అనకాపల్లి జిల్లాలో 70 వేలా 372.56 హెక్టార్లలో అటవీ సంపద ఉంది. అనకాపల్లి, యలమంచిలి, చోడవరం, కేడీ పేట, నర్సీపట్నం ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఈ శాఖలో ఒక సబ్ డివిజన్, 5 రేంజర్లు, 11 సెక్షన్లు, 28 బీట్లు, 57 అటవీ బ్లాక్‌లు ఉన్నాయి.

జిల్లాలో నర్సరీలను ఎంత మేరకు అభివృద్ధి చేస్తున్నారు ?

జిల్లాలో మొత్తం ఐదు రేంజ్‌లలో 8 లక్షల మేరకు నర్సరీలను అభివృద్ధి చేస్తున్నాం. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ లైన్ ఏర్పాటు చేశాం. గొలుగొండ డిపోలో ఐదు వేల వెదురు, సుమారు 20 లక్షల విలువచేసే టేకు చెట్లకు ఏప్రిల్ 6న వేలం నిర్వహించనున్నాం. బయ్యవరంలో నగరవనం పేరిట 50 హెక్టార్లలో శారద వనాన్ని అభివృద్ధి చేస్తున్నాం.

ఈ ఆర్థిక సంవత్సరంలో మీరు చేపడుతున్న అభివృద్ధి పనులేంటి ?

ప్లాంటేషన్ అభివృద్ధి కింద క్యాంప స్కీమ్‌లో భాగంగా ఎన్‌పివి విభాగంలో 20 హెక్టార్లలో టేకు మొక్కలు, సిఎ విభాగంలో 125 హెక్టార్లలో ఆర్టిఫిషియల్ రీ జనరేషన్ పద్ధతిలో 40 హెక్టార్లలో టేకు మొక్కలు, ఎయిడెడ్ నేచురల్ రీ జనరేషన్ పద్ధతిలో 85 హెక్టార్లలో మొక్కలు పెంచడం జరుగుతుంది.

అటవీ వన్యప్రాణ సంరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అటవీ సంరక్షణలో భాగంగా అటవీ వన్యప్రాణి సంరక్షణ కోసం మూడు బేస్ క్యాంపులు, రెండు స్ట్రైక్ ఫోర్సులు, నాలుగు చెక్‌పోస్టులలో 33 మంది రక్షణ సహాయకులను నియమించాం. అటవీ పరిరక్షణలో భాగంగా 26.92 లక్షల రూపాయల అపరాధ రుసుము వసూలు చేశాం. ప్రభుత్వ కలప డిపోలో వెదురు, కలప వేలం ద్వారా 87.35 లక్షల ఆదాయం సమకూరింది.

బైక్ రేసర్లపై కొరడా

38 ద్విచక్ర వాహనాలు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీచ్ రోడ్డు ప్రాంతంలో ద్విచక్ర వాహనాలపై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్న 38 మంది బైక్ రేసర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను ట్రాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్ ఆదివారం సాయంత్రం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. కొందరు యువకులు చిత్రవిచిత్రమైన విన్యాసాలు చేస్తూ బీచ్ రోడ్డులో పాదచారులు, ఇతర వాహనదారులను భయాం దోళనలకు గురిచేశారు. తీవ్ర ఇబ్బందులు పెట్టారు. ఆ సమాచారం పోలీసులకు అందింది. ఎసిపి జోన్ 1 ట్రాఫిక్ వారి పర్యవేక్షణలో త్రీ టౌన్, ద్వారక, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. వారు దాడులు నిర్వహించి 38 మంది బైక్ రేసర్లను అరెస్టు చేశారు. వారి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

తస్మాత్ జాగ్రత్త

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి విధించే శిక్షలలో సమూల మార్పులు చేసినట్టు టాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మారిన శిక్షల ప్రకారం మానవ ప్రాణాలకు లేదా ఇతరుల వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే విధంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపితే మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.2,500 జరిమానా ఉంటుందని, ప్రభుత్వ అనుమతి లేకుండా రేసింగ్, ట్రైల్స్ చేసినట్లయితే మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.500 జరిమానా ఉంటుందని, రెండోసారి ఇదే నేరం చేసినట్లు అయితే ఏడాది జైలు శిక్ష లేదా రూ.10 వేల జరిమానా విధించబడుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమానాతో పాటు మూడు నెలల లైసెన్స్ రద్దు చేయనున్నామన్నారు. నెంబర్ ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలకు ఇప్పుడు రూ.300 జరిమానా ఉంటుందని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.5 వేలు జరిమానా ఉంటాయని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇచ్చినట్లయితే వాహన యజమానికి మూడు నెలలు జైలు శిక్ష ఉంటుందన్నారు.

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యాన ఓపెన్ ఇంటర్ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ-1 ఎం.శివరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. స్థానిక జివిఎంసి హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, ఆనందపురం జెడ్పీ హైస్కూల్ కేంద్రాల్లో 639 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలో ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయానికి భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న బి జాగ్ బీచ్ రెస్టారెంట్ అధినేత ఎ.శ్రీకాంత్ తన సొంత నిధులు రూ.20 వేలుతో సమకూర్చిన సిసి కెమెరాలను ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసిన శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక నూకాలమ్మ గుడి ప్రాంగణంలోని రామాలయంలో ఆర్‌విఆర్ కంపెనీ మేనేజర్ చింతాడ ఫల్గుణరావు, రేవతి దంపతుల ఆర్థిక సాయంతో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. నూకాలమ్మ ఆలయ పూజారి సత్తిరాజులు, విగ్రహదాతలు ఫల్గుణ రావు, రేవతి కుటుంబ సభ్యులు సింగూరు ఆనందరావు, సనపల సత్యనారాయణ, తమ్మినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి హైస్కూల్‌లో ఆదివారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా ఆటపాటలతో సరదాగా గడిపారు. హెచ్‌ఎం ఇ.భవానీ మాట్లాడుతూ, టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కరాటే పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెంలో ఆదివారం జరిగిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను వార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ ప్రారంభించారు. పురుషులు, మహిళలు, పిల్లలకు వేర్వేరు కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి, మెడల్స్, షీల్డ్ బహూకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో ఇటువంటి టోర్నమెంట్‌లు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : పిఎం.పాలెంలోని జివిఎంసి కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న ఓపెన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో షాడో షటో ఖాన్ కరాటే అకాడమీ ఆనందపురం విద్యార్థులు అత్యధిక పతకాలు సాధించారు. ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కుప్పా రేవంత్ కుమార్(7) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కక్కల నిఖిలేశ్వర్ (10) ఖాతా విభాగంలో బ్రాంజ్ మెడల్, సెనగం వికాస్ గోల్డ్ మెడల్, సెనగం సంజయ్ బ్రాంజ్ మెడల్, ఖాతా విభాగంలో ముడసల సిద్దు గోల్డ్ మెడల్ సాధించారు. కోచ్ వెంకటరమణకు కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి అభినందనలు తెలిపారు.

జూ పార్కులో పోస్టర్ ప్రదర్శన



పోస్టర్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, జూ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం విద్యార్థులకు మూడు విభాగాల్లో పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. జూ పార్కులోని బయోస్కోపు మందిరంలో జరిగిన పోటీల్లో ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు గల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీతాకోక చిలుకలు, పక్షులు, తేనెటీగలు ఎందుకు ముఖ్యమైనవి, వన్యప్రాణుల సంరక్షణలో సాంకేతికత పాత్ర, వన్యప్రాణి సంరక్షణ నిధులు- స్థిర భవిష్యత్తుకు కీలకం అన్న విషయాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను జూ క్యూరేటర్ జి.మంగమ్మ అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలగా ఎయు జంతు శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సి.మంజులత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.భారతి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు గోపాలనాయుడు, బి.గోపి, జూ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ పరిధి గద్దపేట గ్రామంలో 2024 ఆగస్టులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటుచేశారు. 'ట్రాన్స్‌ఫార్మర్ వేయ్యరూ?' శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గద్దపేట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. పద్మనాభం పంచాయతీ పరిధి ఇసుకలపాలెంలో రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కూడా సిద్ధంగా ఉందని, త్వరలో వేస్తామని స్థానిక విద్యుత్ శాఖ అధికారి వెంకట్రావు ఆదివారం తెలిపారు.

పలుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తి నగర్‌లో యూత్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయశ్రీ ఆసుపత్రి ఎమ్‌డి, న్యూరాలజీ వైద్య నిపుణులు బగాది సునీల్ కుమార్ ఎండోక్రైనాలజీ వైద్య నిపుణులు పైడి వేణు మాధవి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళింగ సంక్షేమ సేవా సంఘం మధురవాడ జోన్ అధ్యక్షులు బగాది లక్ష్మణరావు, ఆర్.వెంకటరమణ, తమ్మినేని శేఖర్, గురుగుబెల్లి నగేష్, అమరాపు రవి, ఈమంది శ్రీను, కొల్లి సతీష్, నాగరాజు సుబ్బరాజు, బగాది జగదీశ్వరరావు, ఈమంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్ కుమార్

పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రవితేజ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పద్మనాభం మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దామోదరరావు ప్రారంభించారు. శిబిరంలో పేదలు, వృద్ధులు వికలాంగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

400 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న జైజవాన్ ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి -ఆనందపురం : జై జవాన్ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆనందపురం మండలం వేములవలస కూడలిలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుప్ప రాజశేఖర్ ఆధ్వర్యాన అభాగ్యులు, నిరాశ్రయులు, నిరుపేదలు 400 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోశాధికారి కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ, జై జవాన్ పౌండేషన్ స్థాపించిన మూడేళ్లలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి ఆపదలో ఉన్న వారికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. రోడ్డు పక్కన ఉండే అభాగ్యులకు, అనాధాశ్రమాలకు, వృద్ధాశ్రమలకు అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. కేన్సర్ పేషెంట్లకు, కిడ్నీ బాధితులకు పేదలకు ధన సహాయం, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పిల్లలకు నగదు ప్రోత్సహకాలు, ఉచిత ట్యూషన్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రటరీ ముడసల కార్తీక్, జనరల్ సెక్రటరీ ఇమంది శ్రీనివాసరావు, ఫౌండేషన్ మెంబర్లు మెరుగు రాము, కుప్ప శ్రీను, ముడసల బద్రి, పీతల రాజు, కుప్ప సంతోష్, కొండ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక వెల్చేరు కళావేదిక ఆధ్వర్యాన కళా సాహితీ సంస్థ సహకారంతో ఇటీవల నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం నగదు బహుమతులు అందజేశారు. స్థానికంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో వెల్చేరు కళా వేదిక అధ్యక్షులు వెల్చేరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, కవులను, రచయితలను తగురీతిన గౌరవించడం, వారు రాసిన వివిధ కథలను పుస్తక రూపంలో తీసుకొని రావడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. తమ సంస్థ వెచ్చేరు కళా వేదిక ఇచ్చిన పిలుపునకు స్పందించి కవులు 120 కథలను రాయగా ఇందులో 15 కథలను ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకరించిన తన కుమార్తె వెల్చేరు ప్రశ్న, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళా సాహితీ సంస్థ అధ్యక్షులు పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళా సాహితీ సంస్థ సభ్యులు ఎం.కోటయ్య, కాళ్ల సన్నీ, కె.రామానాయుడు, పి.అరవింద్, పిట్టా సురేష్, మైలపల్లి లక్ష్మణరావు, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

23 తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలో 23 తులాలు బంగారం రూ.లక్ష నగదు చోరీకి గురైన కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ శివాలయం వద్ద నివాసముంటున్న కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కాకినాడ వెళ్తారు. తిరిగి ఆదివారం ఉదయం వచ్చేసరికి ఇంట్లో ఉన్న వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్వారక క్రైమ్ పోలీసులు వచ్చి పరిశీలించారు. 23 తులాలు బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. ద్వారకా క్రైమ్ సిఐ చక్రధర్ పర్యవేక్షణలో ఎస్ఐ రాజు దర్యాప్తు చేపట్టారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి -రాంబిల్లి : బాలికను అత్యాచారం చేశారని నేరారోపణతో ఆదివారం రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సిఐ సిహెచ్ నర్సింగరావు తెలిపారు. మండలంలోని కృష్ణంపాలేనికి చెందిన లాలం రామదాసుపై బాధిత బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారనాన్నరు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు

చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ముంగర్లపాలెం గ్రామంలో చింతచెట్టు నుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు గొలుగొండ ఎస్సై పీ.రామారావు తెలిపారు. జీ.మాడుగుల మండలం గడుతూరుకు చెందిన గెమ్మెలి శేఖర్(29) తన చిన్నాన గ్రామమైన మండలంలోని సీతకండికి కూలీ పనుల నిమిత్తం వచ్చాడు. ఈ క్రమంలో ముంగర్లపాలెంలో చింత చెట్టు ఎక్కగా చెట్టుపై నుంచి పడిపోవడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి -అనకాపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.ఐదువేల జరిమానా విధిస్తూ అనకాపల్లి 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలివి. అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం గ్రామానికి చెందిన జామి అప్పలరాజు రాంబిల్లి మండలం నరసాపురం గ్రామానికి చెందిన ధనలక్ష్మిని 2007లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తన భర్త అదనపు కట్నం కావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు ధనలక్ష్మి 2015లో ఫిర్యాదు చేసింది. కేసులో నేరాభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పినట్టు ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ప్రజాశక్తి- ఆనందపురం : బాల బాలికలకు చిన్నతనం నుండే విలువలతో కూడిన విద్యనందించాలని ది సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆనందపురం కూడలి బిపి కల్లాలు రోడ్డులోని ది ఐ స్కూల్ (ప్లే స్కూల్) రెండవ వార్షికోత్సవాన్ని శ్రీముద్రా స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కాకర సురేష్‌కుమార్, ప్రిన్సిపల్ కుప్ప లహరి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు కూడా తగిన శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ కాకర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలనే ఈ పాఠశాలను స్థాపించామన్నారు. పాఠశాల నివేదికను ప్రిన్సిపల్ కుప్ప లహరి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేజీ 2 విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటిబిపి అసిస్టెంట్ కమాండర్ వైన్‌పతి, కాకర వెంకటరమణ, అక్కిరెడ్డి గణేష్ రాజు, బసవ కృష్ణమూర్తి, వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన 1975 -76 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొందరికి సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా డైట్ విశ్రాంత అధ్యాపకులు ఎ.సాంబమూర్తి, జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ బి.ఈశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు హాజరయ్యారు. పూర్వ విద్యార్థి వి.గుజ్జలమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.భీమారావు, ఎస్.పీరుబాబు పాల్గొన్నారు.



పరదేశిని సన్మానిస్తున్న దేవన్‌రెడ్డి

పనిచేసే వారికి గుర్తింపు

ప్రజాశక్తి -గాజువాక : కష్టపడి పనిచేసే కార్యకర్తను పార్టీ ఎప్పుడూ గుర్తించుకుంటుందని గాజువాక నియోజవర్గ వైసిపి అధ్యక్షులు తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైసిపి గాజువాక ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా నియమితులు కావడం, జన్మదినం సందర్భంగా మార్టుపూడి పరదేశిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుండి పార్టీ కోసం పరదేశి అనేక కార్యక్రమలు చేశారన్నారు. గాజువాకలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ, పార్టీ పనులు, సేవా కార్యక్రమాల్లో పరదేశి ముందుండి దిగ్విజయం చేస్తారని తెలిపారు. మార్టుపూడి పరదేశి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో పార్టీ కోసం మరింతగా పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పల్లా చిన్నతల్లి, గంట్యాడ గురుమూర్తి, ఎమ్‌డి.గౌస్, ధర్మాల శ్రీనివాస్‌రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, అండిబోయిన అప్పారావు, పిట్టా రెడ్డి, బొడ్డ గోవింద్, కాకినాడ పెంటారావు, పాల్గొన్నారు.

'వైసిపితోనే రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్ రద్దు'

ప్రజాశక్తి-సీతమ్మధార : గత వైసిపి ప్రభుత్వం వల్లనే రుషికొండ బీచ్‌కు బ్లూ ఫాగ్ రద్దయిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రుషికొండ బీచ్ అభివృద్ధిపై గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందన్నారు. టూరిజం ఆస్తులు ఇప్పటికే వైసిపి నాయకుల కబంధహస్తాల్లో ఉన్నాయన్నారు. నిర్లక్ష్య వైఖరి కనబరిచిన అధికారులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



కాంగో డ్రమ్స్‌ను బహూకరించిన జియ్యాని శ్రీధర్

కాంగో డ్రమ్స్ బహూకరణ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ రజకవీధిలో ఇటీవల జరిగిన బల్లల పండుగలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు స్వాగతం పలికే సమయంలో డప్పులు వాయిస్తూ అద్భుతమైన ప్రతిభ కనబరిచిన చిన్నారులకు కాంగో డ్రమ్స్‌ను ఆదివారం ఆయన కానుకగా అందించారు. శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు సుమారు.రూ.40 వేలు విలువ చేసే కాంగో డ్రమ్స్ సెట్ అందించారు. జియ్యాని శ్రీధర్‌కు చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు లబ్ధిదారులకు అందజేశారు. 44వ వార్డుకు చెందిన ఎం.గాయత్రికి రూ.20 వేలు, 47వ వార్డుకు చెందిన కోరుబిల్లి దేవికి రూ.25,600, మాధవబోయిన వరుణ్ సందేష్‌కు రూ.50 వేలు, 25 వార్డుకు చెందిన అచ్చిబాబుకు రూ.66,700, జామి జయదీప్ నందన్‌కు రూ.2.50 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, వెంకటేష్, ఆశీర్వాదం సుజాత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'టిడ్కో'లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కె.సత్యనారాయణ

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడలోని టిడ్కో హౌసింగ్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. బానోజీతోట, పెదగంట్యాడ టిడ్కో గృహ సముదాయాల లబ్ధిదారులతో ఆదివారం సిపిఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యాన రెండు నెలలుగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. జివిఎంసి, టాటా ప్రాజెక్ట్స్, టిడ్కో అధికారులను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నట్లు చెప్పారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు కల్పించక పోగా, బ్యాంకులు మాత్రం ఇఎంఐ లు కట్టాలని ఒత్తిడి తెస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించకుంటే సిపిఐ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశాలలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె.వనజాక్షి, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘం నాయకులు ఎన్.కృష్ణారావు, తిరుమలరావు, ఎంఆర్‌వి.రమేష్, పి.అప్పలరాజు, భాస్కరరావు, శేఖర్, ఖాన్, రహీన, స్వర్ణలత, డి.రమాదేవి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆదర్శనీయం



భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో మురళీ నగర్ వాకర్స్ క్లబ్ ఆదర్శనీయమని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వృద్ధులు, మహిళల సంక్షేమానికి మరిన్ని చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమాజంలో మహిళల పట్ల చూపుతున్న వివక్షతను తొలగించడంలో క్లబ్ సభ్యులు కీలకపాత్ర వహించాలని కోరారు. భవిష్యత్తులో జాతీయ సేవా పథకం వాకర్స్ క్లబ్‌తో కలిసి చైతన్య కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యానందం వాకర్స్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్.భానుప్రకాష్ మాట్లాడుతూ, ప్రతి నెలా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరుగుతోందని, 'వాకర్స్ వాయిస్' అనే ప్రత్యేక సంచికను కూడా విడుదల చేస్తున్నామని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భాగ్యలక్ష్మిని క్లబ్బు సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, ప్రకాష్ నగర్ గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, పెందుర్తి గ్రంథాలయాధికారి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి ఇనకోటి కొండలరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 32వ వార్డుకు చెందిన వ్యాపారవేత్త ఇనకోటి కొండలరావు ఆదివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన నగర పార్టీ కార్యాలయంలో కొండలరావుకు విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా మార్చి 14వ తేదీన పిఠాపురంలో నిర్వహించబోయే జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, జనసేన చేసే కార్యక్రమాల పట్ల ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. జనసేనలో అందరికీ భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇనకోటి కొండలరావు మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యాన వంశీకృష్ణ చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితుడునై జనసేనలో చేరానన్నారు. 32వ వార్డుకు చెందిన వివిధ కులాలకు చెందిన సుమారు 500 మంది తనతో పాటు జనసేనలోకి వచ్చారన్నారు. పార్టీలో చేరిన వారిలో చౌడవాడ వరహాలనాయుడు, ఆళ్ల అచ్చిబాబు, చౌడవాడ నాయుడు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, జనసేన నాయకులు శివప్రసాద్‌రెడ్డి, తెలుగు అర్జున్, తెలుగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కెజిహెచ్ సిబ్బంది ప్రతిభ

సూపరింటెండెంట్ శివానంద అభినందన



అభినందనలు తెలుపుతున్న కెజిహెచ్ సూపరింటెండెంట్ శివానంద

ప్రజాశక్తి- విశాఖపట్నం : కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్) సిబ్బంది దేశవ్యాప్తంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్లు పద్మ, కల్పన మౌళి, మేనేజర్ గారా సత్యనారాయణ తదితరులు విజేతలను అభినందించారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 14 నుంచి 18 తేదీల్లో చెన్నైలో జరిగిన వాలీబాల్ పోటీల్లో కేజీహెచ్ సిబ్బంది విశేషంగా ఆకట్టుకున్నారు. నేషనల్ వాలీబాల్ మెన్ టీం కోచ్‌గా కేజీహెచ్‌లోని టెస్లా స్కానింగ్ సెంటర్ ఇన్‌చార్జి బి.అమృతరాజు ఎంపికయ్యారు. గత ఆరేళ్లుగా నేషనల్ స్థాయిలో ఆడిన అనుభవం కలిగిన అమృతరాజుకు ఈ ఏడాది కోచ్ బాధ్యతలు అప్పగించారు. నేషనల్ వాలీబాల్ వుమెన్ టీమ్‌లో కేజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్ వి.శాంతి అద్భుత ప్రదర్శన చూపారు. ఫిబ్రవరి 18 నుంచి 21వ తేదీల్లో సెంటర్ సివిల్ సర్వీసెస్ బోర్డ్ ఆధ్వర్యాన అథ్లెటిక్స్ పోటీల్లో కేజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్ కె.రాధారాణి 800 మీటర్లు, 400 మీటర్లు రేస్‌ల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. అమృతరాజు, శాంతి, రాధారాణి ప్రతిభను చాటడం సంతోషకరమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద పేర్కొన్నారు. కేజీహెచ్ సిబ్బంది నేషనల్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో కేజీహెచ్ తరపున పూర్తి మద్దతు అందిస్తామని వెల్లడించారు.

హైస్కూల్‌కు కుర్చీలు


ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు చట్టి గోపి తదితరులు కలసి ఆదివారం 50 కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రశాంతికి అందజేశారు. ఈ సందర్భంగా చట్టి గోపి మాట్లాడుతూ, 1990-91లో పదో తరగతి చదువుకున్న తామంతా కలిసి ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ నర్సింగ్, డిజిటల్ ఎక్స్‌ప్రెస్ యజమాని బాలాకుమార్, ఎస్.పిల్ కృష్ణారెడ్డి, కృష్ణ, రామకృష్ణ, రామారావు, షకీలా, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాస్యావధానం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సరదాగా నవ్వుకుందాం రండి అనే హాస్యావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంధించిన ప్రశ్నలకు అవధాని హాస్యం జోడించి సమాధానాలిస్తూ ప్రేక్షకులను నవ్వించారు.

మంచి సమాజం కోసం బ్రహ్మకుమారీల సేవ

ప్రజాశక్తి-పెందుర్తి : మంచి సమాజం కోసం బ్రహ్మకుమారీలు నిస్వార్థంగా సేవ చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ శరగడం చిన్న అప్పలనాయుడు అన్నారు. జివిఎంసి 96వ వార్డు పరిధి ఎల్ఐసి కాలనీలో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యాన శివరాత్రి ఉత్సవాలు సాగుతున్నాయి. ఆదివారం నాటి ఉత్సవాలను చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వ పరివర్తన స్వయం ప్రవర్తన ద్వారా సాధ్యమవుతుందన్న భావనతో బ్రహ్మకుమారీలు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారని తెలిపారు. బ్రహ్మకుమారిస్ ప్రతినిధి సిస్టర్ భవాని మాట్లాడుతూ, రాజ సాధన ద్వారా జీవితంలో సుఖసంతోషాలను సముపార్జించుకోవచ్చని స్పష్టం చేశారు.



జ్ఞాపికను అందుకుంటున్న శరగడం

శిలాఫలకాల ధ్వంసంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆగంతకులు ధ్వంసంపై పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధ్వంసమైన శిలాఫలకాలను పునర్నిర్మించాలనికోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి నాయకులు వరదపు రెడ్డి లలిత నాయుడు, కె.వి రమణ, కె. ఎం పాలెం సర్పంచ్ గంధం రామకష్ణ, వరదపు రెడ్డి వెంకటరమణ, గంగ వంశం సంతోష్ ఉన్నారు.

విభేదాలున్నట్లు అవాస్తవ ప్రచారం

ప్రజాశక్తి-దేవరాపల్లి: తెనుగుపూడి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు మధ్య జరిగిన ఘర్షణను పార్టీలకు ఆపాదించడం సరైనది కాదని జనసేన పార్టీ మండల అధ్యక్షులు గొర్లెపోటు రామ్మూర్తి నాయుడు, మండల టిడిపి కార్యదర్శి శరఖాన సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ. తెనుగుపూడి గ్రామంలో అల్లం వెంకు నాయుడుపై శనివారం జరిగిన దాడి ఘటనలో జనసేన, టిడిపి మధ్య విభేదాలు ఉన్నాయనడం అవాస్తమన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత విభేదాలను పార్టీలకు ఆపాదించడం సరికాదన్నారు. తెనుగుపూడిలో కూటమి పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య విబేధాలేవని, అందరం సమిష్టిగా ఉన్నామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు,మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, జనసేన మండల కార్యదర్శి రామ్ చరణ్, టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు కాటిపం అర్జునరావు పాల్గొన్నారు.

సిరి ఫంక్షన్ హాల్ ప్రారంభం



ఫంక్షన్ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-సబ్బవరం.: మండలంలోని గొట్టివాడ గ్రామంలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం దరి నూతనంగా నిర్మించిన సిరి ఫంక్షన్ హాల్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతున్న సబ్బవరంలో అన్నివసతులతో ఇటువంటి ఫంక్షన్ హాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గొట్టివాడ సర్పంచ్ సాలాపు మీనావెంకటేశ్వరరావు, ఎంపిటిసి బొండా శేషుకుమారి సత్యారావు, కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, జనసేన మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, బంటికోళ్ల పద్మ, వనం సత్యనారాయణ, పడాల వెంకటరమణ, కోరాడ శ్రీనివాసరావు, టి శేఖర్, ఆడారి నాగరాజు, సీరం అప్పలరాజు, బగ్గు ఈశ్వరరావు, వడిశల రమేష్, బొండా శివ, వాకాడ కనకరాజు, ఆడారి వెంకట్, కళ్ల శ్రీను, పెద్దాడ రమణమ్మ, సబ్బవరపు రవి, వెన్నెల నరేష్, నెక్కల కెవిన్ పాల్గొన్నారు.

నూకాంబిక ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు తెరువుపల్లి నూకాంబిక మహోత్సవం ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. ఆదివారం ఉత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఉత్తరాంధ్ర జనసేన పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సుందరపు సతీష కుమార్ ఆవిష్కరించారు.. విశాఖ కైలాసగిరి అన్నపూర్ణమ్మ ఆలయంలో. మొక్కుబడులు తీర్చుకున్నారు.

కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలి

● బ్రాండిక్స్ కార్మికుల జీతాలపై సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ కార్మికులకు కనీస వేతనం రూ.15వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురంలో బ్రాండిక్స్ కార్మికులకు వేతనాల పెంపుపై సిఐటియు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బ్రాండిక్స్ యాజమాన్యం పెంచిన వేతనాలు సంతృప్తికరంగా లేవన్నారు. కార్మికులకు సర్వీస్ వారీగా రూ.750 నుంచి రూ.1200 వరకు జీతం పెంచినట్లు ప్రకటించి అన్యాయం చేసిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంపు ఎటూ సరిపోదన్నారు. కార్మికుల శ్రమతో కోట్లలో ఆదాయాన్ని ఆర్జిస్తున్న కంపెనీలు, కార్మికులకు పనికి తగ్గ వేతనం పెంచకుండా వివక్ష చూపడం దుర్మార్గమన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని పరిశ్రమ కార్మికులకు కనీస వేతనాలు జిఒను సవరించాలన్నారు. పరిశ్రమ స్థాపనలో ప్రభుత్వంతో కుదుర్చుకునే ఒప్పందం ప్రకారం 60 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు.ఈ మేరకు ఎకరాకు రూపాయి చొప్పున వెయ్యి ఎకరాల భూమిని యాజమాన్యానికి కేటాయించిందని గుర్తు చేశారు. కార్మికులకు ఆమోదయోగ్యంగా జీతాలు పెంచకుంటే మళ్లీ సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి .దేవుడు నాయుడు, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, రాంబిల్లి మండల కార్యదర్శి చందక. రామకృష్ణ, రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పనిచేస్తుండగా పరంజి నుంచి పడి గాయపడిన మేస్త్రి కంటిపాము అప్పారావు, అనారోగ్యానికి గురైన ప్రకృతి కన్నయ్య కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రమైన అచ్యుతాపురంలో సిఐటియు అనుబంధ మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులైన వీరికి ఒక్కొక్కరికి రూ.ఆరు వేలు చొప్పున సంఘం తరపున సంఘ అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గాలి పైడ్రాజు సింగంపల్లి రాజు నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోమనాయుడు, చింతకాయల శివాజీ పాల్గొన్నారు.

మహిళా పోలీసు కుటుంబాల విహారయాత్ర



విహారయాత్రలో పాల్గొన్న మహిళా పోలీసులతో డిఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచనలతో 'మహిళా సాధికారత వారోత్సవాలలో' భాగంగా ఆదివారం అనకాపల్లి డిఎస్‌పి ఎం.శ్రావణి ఆధ్వర్యంలో మహిళా పోలీస్ కుటుంబ సభ్యులతో బొజ్జన్నకొండ వద్ద విహారయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విహారయాత్రలో భాగంగా ఆటపాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా పోలీసులు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో సిఐలు విజయ్‌కుమార్, అశోక్ కుమార్, స్వామినాయుడు, వెంకటనారాయణ, ఎస్‌ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాములమ్మ, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యాల వల్లే ఫార్మా ప్రమాదాలు

● సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ ఫార్మాసిటీలో భద్రతా చర్యల్లో వైఫల్యం వల్లే ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా అధికారులు, యాజమాన్యాలు నివారణ చర్యలు చేపట్టడం లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఎపిటోరియా పరిశ్రమల్లో గతేడాది ఏప్రిల్ 7న జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లాకు చెందిన ఒక కార్మికుడు అప్పుడు మృతి చెందగా,. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఎండిసి ద్రావణంతో క్లీనింగ్ చేస్తున్న అప్పలనాయుడు అనే కాంట్రాక్ట్ కార్మికుడుకు అస్వస్థతకు గురయ్యాడు. ఫార్మా కంపెనీల్లో విధులు నిర్వహించే కార్మికుల భద్రతను యాజమాన్యాలు గాలికొదిలేశాయనడానికి తాజా ఘటన నిదర్శనమన్నారు. రసాయనాలతో పనిచేస్తున్నప్పుడు ఎయిర్‌సూట్, మంచి మాస్కులు ధరించి ఉంటే ఈ ఘటన చోటుచేసుకునేది కాదన్నారు. కార్మికుల భద్రతను యాజమాన్యాలు గాలికొదిలేస్తున్నా పట్టించుకునే దిక్కులేదని, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పోలీస్ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. భద్రతలో నిర్లక్ష్యంతో ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఫార్మాపరిశ్రమలో వరుస ప్రమాదాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు.

'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీవిద్య

ప్రజాశక్తి- కశింకోట: మండలంలోని తాళ్ళపాలె అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ఆదివారం అనకాపల్లి అదనపు జిల్లా జడ్జి ఎన్. శ్రీవిద్య అవగాహన కల్పించారు. పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను వివరించారు. పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచితుల పట్ల ఎటువంటి జాగ్రత్తలుతీసుకోవాలో గురుకులంలోని 600 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాల ప్రిన్సిపల్‌జి. గ్రేస్ మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో ఆత్మవిశ్వాసం



మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ఆదివారంగౌరీ గ్రంథాలయంలో పోటీపరీక్షల శిక్షణా కేంద్రం శ్రీధర్ సీనీజ ఆధ్వర్యంలో 'ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్' టాలెంట్ టెస్ట్ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు టాలెంట్ టెస్ట్‌ల్లో కూడా రాణించాలన్నారు. పోటీ పరీక్షల సన్నద్ధతకు , ఇలాంటి టెస్టులు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసంతోపాటు ప్రేరణ, పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు శ్రీధర్ సీనీజ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. శ్రీధర్ సీనీజ సమన్వయకర్త కె.మనోజ్, శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు విల్లూరి రాజేష్ పాల్గొన్నారు.

పాఠశాల రక్షణ గోడ నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రక్షణ గోడ నిర్మాణానికి మంజూరైన నిధులు రూ.35 లక్షలతో ఆదివారం పనులు ప్రారంభించారు. 390 మీటర్ల పొడవునా రక్షణ గోడ నిర్మాణ పనులు చేపడతారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరెడ్ల సూర్య ప్రకాష్, ఉప సర్పంచ్ సేనాపతి వెంకటేష్, గౌతు రాంబాబు, వీసం నానాజీ, కింతాడ శ్రీను, స్నేహితుల రమణ, కర్రి వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

శరవేగంగా హైస్కూల్ ప్రహరీ నిర్మాణం

కె. కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. పాఠశాల ప్రహరీ చాలా చోట్ల శిథిలావస్థకు చేరుకోవడంతో, ఇటీవల పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రహరీ నిర్మాణానికి రూ.38.5 లక్షల గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేయగా, పనులు శరవేగంగా సాగుతున్నాయి.

మూలపేటలో వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి -మునగపాక: పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ దీపాల అమరికతో పాటుగా, పారిశుధ్యం,తాగునీటి సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. ఆదివారం. గ్రామంలో పలు వీధులలో విద్యుత్ లైట్లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోనే కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతు కమతాల్లో తాగునీటి బోర్లతో పాటు విద్యుత్ లైన్లు, లైట్లను అమరుస్తున్నట్లు తెలిపారు.

నమ్మించి మోసగించాడు..

ప్రియుడి ఇంటి ముందు మహిళ ఆందోళన



బాధిత మహిళను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి - చోడవరం : వితంతువుకు మాయమాటలు చెప్పి, లోబరుచుకుని, ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ముఖం చాటేయడంతో ప్రియుని ఇంటి ముందు బాధిత మహిళ ఆందోళనకు దిగిన సంఘటన మండలంలో గాంధీ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి.

గాంధీ గ్రామానికి చెందిన మళ్ల నూకరత్నం అనే మహిళ భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. భర్త మరణం తర్వాత చోడవరంలో బట్టల షాపులో పనిచేస్తూ ఓ పాపతో జీవనం సాగిస్తున్న ఆమెను, అదే బట్టల షాప్ ముందు మెకానిక్ షాప్ నిర్వహిస్తున్న కామోజు సతీష్ అనే వివాహితుడు మూడేళ్ల క్రితం ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. ఆమెను లోబరుచుకుని సహజీవనం చేయడంతో ఇటీవల ఓ పాపకు నూకరత్నం జన్మనిచ్చింది. అయితే తనకు సంబంధం లేదని సతీష్ ముఖం చాటేయడంతో బాధితురాలు అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఇరువురిని స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు, కలిసి ఉండాలని పంపించేశారు. పోలీసు సూచనలను బేఖాతరు చేయడమే కాకుండా, సతీష్ వైఖరి మార్పురాకపోవడంతో ఆదివారం బాధిత మహిళ సతీష్ ఇంటి ముందు ధర్నాకు దిగింది. తమకు న్యాయం జరిగే వరకూ ఇంటిముందే ఆందోళన నిర్వహిస్తానని బాధితురాలు నూకరత్నం తెలిపింది. కాగా బాధిత మహిళ తమ ఇంటికి ఆందోళనకు వస్తుందని తెలుసుకున్న సతీష్ కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసుకుని పరారయ్యారు. బాధిత మహిళను మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని లక్ష్మీదేవిపేట పాత్రుడు కాలనీ సంపత్ వినాయక ఆలయం 17వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వైసిపి యువనేత మలసాల కుమార్ రాజా, 83వ వార్డు ఇంచార్జ్ జాజుల రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ద పెంటారావు, బుద్ద భాస్కర్ రావు, పాము సన్నిబాబు రేభాక స్వామి,కొమ్మాన శంకరరావు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : మండలంలోని నర్సింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత, వెంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధాన, సాయంత్రం స్వామి విగ్రహాలతో తిరువీధి నిర్వహించారు. వెంకన్న అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, వైసిపి యువనేత మలసాల కుమార్‌రాజా వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు. అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా భావన్నారాయణస్వామి కల్యాణం

ప్రజాశక్తి-.అనకాపల్లి : స్థానిక భద్రావతి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జ్ భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.లక్ష్మీదేవి పేట పాత్రుడు కాలనీలో సంపత్ వినాయక దేవాలయ వార్షికోత్సవంలో వారు పాల్గొన్నారు.

రెగ్యులేటర్ మరమ్మతులకు శ్రీకారం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం మెలిపాక గెడ్డ నాలుగు రెగ్యులేటర్లు మరమ్మతులు పనులకు ఆదివారం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వీసం సత్యారావు ప్రారంభించారు. ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులు, రూ.15లక్షల ఆర్థిక సాయంతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో గౌతు రాంబాబు, సేనాపతి వెంకటేష్, కిన్నాడ శ్రీను, కర్రి వెంకట సోము నాయుడు, ఎస్ రమణ, భీముని ఆదినారాయణ, బిల్లింగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో నూకంబిక అమ్మవారి పండగ సందర్భంగా కెవిఆర్ బ్యాచ్ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రెండవ రోజు కొనసాగింది. గ్రామానికి చెందిన ఘట్టా నారాయణరావు, గుర్రం నాగేశ్వరరావు, కాకి సన్యాసి పైడిరాజు జ్ఞాపకార్థం ఏటా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు.

టోర్నీలో 50 జట్లు పాల్గొంటుండగా, ఆదివారం ఐదు పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. వెదురువాడ, పరిపాలెము, హరిపాలెం, లంక ధర్మవరం, వెంకటాపురం, దుప్పితూరు గ్రామాల జట్లు ప్రత్యర్థులపై గెలుపొందారు. పోటీలలో మంచి ప్రతిభ నైపుణ్యం చూపించిన క్రీడాకారులు పోకిరి శ్రీను, సతీష్, వెంకటేష్, అభిలకు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. క్రీడాకారులను నూకంబిక ఉత్సవ కమిటీ నిర్వాహకులు కె.వి రమణ, జనసేన పార్టీ నాయకులు కెకెవిఎస్.రాజు (హరిబాబు), అంజి, రాజు, కాకి హరీష్ పరిచయం చేసుకున్నారు.

బంగారమ్మపాలెంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో ఈనెల 13న జరుగు ముత్యాలమ్మ తల్లి పండగ పురస్కరించుకొని గ్రామంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని సర్పంచ్ దాడి లావణ్య, కన్నమనాయుడు టాస్ వేసి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 40జట్లు పోటీల్లో పాల్గొంటుండగా, 13న పండుగ రోజున విజేతకు రూ.30వేలు, రన్నర్‌పకు రూ20వేలు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్య ప్రకాశరావు, గ్రామ కమిటీ దొడ్డి సోమేశ్వరరావు, శిలవరశెట్టి మాలినాయుడు, దొడ్డి రాజ్ కోటి, దొడ్డి వీర అప్పారావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన ఆటగాళ్లకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

'హెరిటేజ్' పాల సేకరణ కేంద్రాలు ప్రారంభం



పాల కేంద్రాలను ప్రారంభిస్తున్న డెయిరీ మేనేజర్ శేషు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని దుప్పుతూరు, రాజుపేట గ్రామాలలో ఆదివారంహెరిటేజ్ డెయిరీ నూతన పాల కేంద్రాలను డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు పోసిన రైతులందరికీ ప్రమాద బీమా సహజ బీమా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పాడి పశువులకు కృత్రిమ గర్భాధారణ ఇంజిక్షన్లు రూ.50లకు ఆడ దూడ పుట్టేందుకు ఇంజిక్షన్‌ను రూ.500లకు వేస్తున్నట్లు తెలిపారు. సభ్యరైతులకు ఏటా రెండుసార్లు బోనస్‌తోపాటు పాడి పశువులు కొనుగోలుకు రైతుకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర డెయిరీలతో పోలిస్తే, అధిక ధర చెల్లించి పాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో నూకరాజు, సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

తెగిపడ్డ కేబుల్ వైరుతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట ఆంజనేయస్వామి గుడి ఎదురుగా భీమునిపట్నం నర్సీపట్నం రోడ్డుపై ఎపి ఫైబర్ నెట్ కేబుల్ ప్రమాదభరితంగా ఉంది రోడ్డుకు అడ్డంగా పైనుంచి వేసిన ఈ కేబుల్ వైరు, ఎత్తైన చెరకులోడు లారీ తగలడంలో తెగి మెయిన్ రోడ్డుపై అడ్డంగా పడి ఉంది. పది రోజులుగా రోడ్డుకు అడ్డంగా వైరు ఉండడంతోపాటు వాహనాలన్నీ దానిమీదుగా వెళుతున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు అంటున్నారు. కొంచం లావు, మందంగా ఉన్న కేబుల్ వైరు పైనుంచి వాహనాలు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగించే ఆర్‌అండ్‌బి, రెవన్యూ, పంచాయతీ అధికారులతోపాటు పోలీసులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత యంత్రాంగం పట్టించుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్

నీటికుంటల నిర్మాణానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రైతులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చే నీటి నిల్వ గుంతల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలని ఉపాధి హామీ ఎపిఒ ఎస్.వరహాల బాబు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నీటి నిల్వ చేసే గుంతల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రెండు సెంట్లు భూమిలో రెండు మీటర్ల లోతు కుంటను తవ్వి నీటిని నిల్వ చేసుకుంటే ఆ భూమి చుట్టూ కాయగూరలు వివిధ రకాల మొక్కలు పెంపకానికి నిల్వ ఉన్న నీరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు, దీనికయ్యే వ్యయం రూ.50వేలు వరకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. అలాగే అంతకన్నా పెద్దగా 10 సెంట్లు వరకు నీటి నిల్వ గుంతలు తవ్వితే చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందన్నారు. దీనికి ప్రభుత్వం రూ.2 లక్షల మేర అందిస్తుందన్నారు. జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ వరహాల బాబు కోరారు.

ఎండలతో జాగ్రత్త!

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై తగు జాగ్రత్త తీసుకోవాలని దిబ్బిడి ఆరోగ్య ఉపకేంద్రం సిహెచ్ఓ టి.రామేశ్వరి అన్నారు. ముందుందు ఎండలు మరింత పెరిగి, రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరికలు నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని కోరారు. బాలింతలు, చిన్నపిల్లలు వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని మజ్జిగ,నిమ్మరసం, ద్రవపదార్థాలు తరచుగా తీసుకోవాలని అన్నారు.తేలికపాటి దుస్తులు, కాటన్ దుస్తులు, తెల్ల దుస్తులు ధరించాలన్నారు. ఎవరైనా బయటకు వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్స్‌ను తీసుకుని వెళ్లాలన్నారు. పనిప్రదేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఇతర పనులు చేసుకునే ప్రజలు టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. దాతలు స్వచ్ఛంద సంస్థలు నిర్వాహకులు రద్దీప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

బడ్జెట్‌లో బడుగులకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రబడ్జెట్‌లో బడుగు బలహీన వర్గాలు, రైతన్నలకు, సుపరిపాలనకు పెద్దపీట వేశారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారని, పోలవరం ఎడమ కాలువకు రూ.1700 కోట్లు, సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.600 కోట్లు కేటాయించి, ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందన్నారు.అలాగే విద్య, వైద్యానికి నిధులు కేటాయింపు బాగుందన్నారు .ఈ మేరకు ప్రధాని, సిఎం,డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీలా నాగ శ్రీను, దులం గోపీ, బీసెట్టి సుధ,పెతకంశెట్టి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

15కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

మున్సిపల్ సిబ్బందితో వ్యాపారుల వాగ్వాదం



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో గొడవ పడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి - యలమంచిలి : శతశాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై యలమంచిలిలో పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు ఆదివారం మాంసం, పండ్లు, కూరగాయల దుకాణాల వద్ద మున్సిపల్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ దుకాణాలో15 కేజీల ప్లాస్టిక్ సంచుల్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం అమలుకు దాడులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావుపై వ్యాపారులు మూకుమ్మడిగా వాగ్వాదానికి దిగారు.దీంతో మున్సిపల్ సిబ్బందితో గొడవకు దిగిన వారిపై చర్యలకు సిద్ధంకాగా, వ్యాపారుల విజ్ఞప్తితో కేసులేకుండా మొదటి హెచ్చరికగా వ్యాపారులకు గడువిచ్చారు.దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు వివరణ కోరగా, మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్ ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించి, హెచ్చరికలు జారీ చేశామని, ఇకపై నిఘా ముమ్మరం చేసి, జరిమానా, కేసులు పెడతామన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి.- సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన బండారు శంకరరావు కుమారుడు బండారు శ్రీను రూ. 72,116 ఆర్థిక సహాయం ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అలాగే సబ్బవరం గ్రామానికి చెందిన బర్ల నారాయణరావు రూ.30,116 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బండారు శ్రీను, బర్ల నారాయణరావులకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కన్న, దంగేటి నాని, దంగేటి ప్రకాష్ , కర్రి బాబు, కోరాడ శ్రీనివాసరావు, చింతల శీను, ముర్రి కనకరాజు ,ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి -మునగపాక: స్థానిక మెయిన్ రోడ్‌లోని కాశీవిశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణ వేడుక వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ నిర్వహించిన అన్నసమారాధనపాల్గొన్నారు. కార్యక్రమంలో కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, కాంగ్రెస్ జగన్, పెంటకోట శ్రీనివాసరావు, ఆడారి కాశీ బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

4న మోదమ్మ తీర్థం

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది జంక్షన్‌లో కొలువైన మోదమాంబ తీర్థాన్ని ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దొండ గిరిబాబు అన్నారు, తీర్థం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు ఉంటాయన్నారు. వెంకటేశ్వర వర్తక సంఘం ఆధ్వర్యంలో భలే పిల్లలు నృత్య ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు గిరిబాబు తెలిపారు.

ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని కాగిత నుండి పాటిమీద రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసం అయ్యింది. టోల్ ఫీజు తప్పించుకునేందుకు భారీ వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగించడంతో రోడ్డు ఎక్కడికక్కడ గోతులు మయంగా దర్శనమిస్తుంది. రోడ్డు ధ్వంసం కావడంతో స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై కాగిత- చినదొడ్డుగల్లు మధ్య టోల్ గేట్ ఉంది. అయితే లారీ డ్రైవర్లు టోల్ గేట్ ఫీజు తప్పించుకునేందుకు భారీ వాహనాలు, లారీలను గ్రామీణ ప్రాంతాలైన కాగిత, పాటిమీద, వేంపాడు మీదుగా వెళ్లే రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఇదే పనిగా వాహనాలు రాకపోకలు సాగించడంతో భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం అయ్యింది. దీంతో రోడ్డు ఎక్కడికక్కడ గోతులు పడటంతో భారీ వాహనాలు బోల్తా పడుతున్నాయి.

ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు అడ్డంగా లారీలు బోల్తాపడడంతో స్థానిక గ్రామీణ ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయందోళన చెందుతున్నారు.



ఛిద్రంగా మారిన రహదారి

భారీ వాహనాలకు రోడ్డు ధ్వంసం కావడంతో, వర్షం వచ్చినప్పుడల్లా వర్షపు నీరు గోతులలో నిలిచి పోతుందని, దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలిపారు. భారీ వాహనాలు, లారీలు నిత్యం రాకపోకలు సాగించడంతో రోడ్డు అతి తక్కువ రోజుల్లోనే ధ్వంసం అయ్యిందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి భారీ వాహనాలు, లారీలను ఈ రహదారి గుండా రానివ్వకుండా చర్యలు చేపట్టాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నిరసన చేపడుతున్న గిరిజనులు

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వకుండా ఆటంకం పరచడాన్ని నిరశిస్తూ గిరిజన ప్రజలు నెత్తిపై అడ్డాకులు ధరించి టోపీలతో నమస్కారాలు పెడుతూ వినుత్న రీతి నిరసన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖర గ్రామాలైన చిన్నకోనల, భూరిగా, వనిజతో పాటు ఎన్ ఆర్ పురం పంచాయతీ పరిధి మరో ఐదు గ్రామాలకు ఈ రోడు ఉపాయోకరంగా ఉంటుంది. గిరిజనులు ఆదివారం చిన్న కోనల, వనిజ గ్రామాల వద్ద ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, అనారోగ్యాలకు గురైన రోగులకు, గర్భిణీలను డోలీల సహాయంతో ఎత్తైన కొండపల్లి నడుమ 10 నుండి 15 కిలోమీటర్ల దూరం గ్రామాలలో చేర్చవలసి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమేల. అప్పలరాజు, కొనపర్తి సింహాచలంలు మాట్లాడుతూ, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ స్పందించి సుమారు మూడు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు వచ్చారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవని, రోడ్డు పనులు చేపట్టవద్దని అడ్డుపడ్డారన్నారు.నెల రోజుల క్రితం పనులకు వెళ్లిన సార కొత్తయ్య కుమారుడు ఈశ్వరరావు మృతి చెందగా విజయనగరం జిల్లా వెంకట మండలం వనిజ వద్ద నుంచి మృతదేహాన్ని చిన్న కోనేల గ్రామానికి డోలి సహాయంతో 8 కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల నడుమ నుండి తరలించామని గుర్తు చేశారు.రోగులు, గర్భిణీలను మెంటాడ ఆసుపత్రికి తరలించాలంటే ఇదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పత్రికల్లో కథనాలను స్పందించిన కలెక్టర్ రోడ్డు మంజురు చేయగా ఫారెస్ట్ అధికారులు ఆటంకం పరచడం సరికాదన్నారు. అనుమతులు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

అందని మధ్యాహ్న భోజనం బిల్లులు

-అప్పులతో నెట్టుకొస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో గడిచిన మూడు నెలలుగా పాఠశాల విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక బిల్లులు అందక నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సహా 51 పాఠశాలల్లో ఈ పథకం అమలవుతోంది. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి సుమారు మండల వ్యాప్తంగా నెలకు ఏడు లక్షల రూపాయలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. మార్కెట్లో పెరిగిన రేట్ల ప్రకారం మెనూ అందించేందుకు వడ్డీకి అప్పులు తీసుకొచ్చి భోజనాలు ఏర్పాటు చేయవలసి వస్తుందని, మూడు నెలలుగా బిల్లులు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు నిర్వాహకులు తెలిపారు., అధికారులు బిల్లులు అందించే ఏర్పాటు



చేయాలని కోరుతున్నారు.

ఈ విషయమై ఎంఈఓ 2 జోష్‌ను వివరణ కోరగా బిల్లులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేస్తున్నామని జనవరి, ఫిబ్రవరి నెలలకు మాత్రమే బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిపారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

మాదిగ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో శనివారం రాత్రి మాదిగల అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించారు, రత్నాలపాలెం విజ్ఞాన్ సమతాపరాంగణం సమీపంలో బాబు జగజ్జివన్ రావు యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట్యాడ అప్పారావు, స్థానిక యూత్ సలహాదారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మిరియాలు, కాఫీ తోటలు దగ్ధం

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయితీ తలింబ గ్రామంలో 20 ఎకరాల్లో కాఫీ తోటలు దగ్ధమై రైతులకు అపారం నష్టం వాటిల్లిందని ఈ పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కొండలకు నిప్పు అంటుకొని మంటలు వ్యాపించడంతో సుమారు 14 వేల కాఫీ మొక్కలు, నాలుగు వేల మిరియాల మొక్కలు పూర్తిగా దగ్ధం అయ్యాయని తెలిపారు. మిరియాల పంట చేతికొచ్చే సమయానికి అగ్నికి ఆహుతి అవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు దగ్ధమైన కాఫీ తోటలు, మిరియాల తోటల నష్టం పై అధికారులు అంచనా వేసి రైతులకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఘనంగా మోదమాంబ పాదాల తీర్థం

ప్రజాశక్తి-మాడుగుల:

మండలంలోని ఘాటీరోడ్డు కూడలి వద్ద మోదమాంబ అమ్మవారి పాదాల తీర్థ మహోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారి దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం జిల్లా స్థాయి గుర్రాలు పరుగుల పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలు హెూరాహెూరీగా సాగాయి. మహిళల కోలాటం, తోడపెద్దు సేవ వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల తెదేపా అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, కార్యదర్శి దేముడు, జనసేన అధ్యక్షులు, ప్రదాన కార్యదర్శలు, ఘాటీరోడ్డు బలరాం, వర్తక సంఘ నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.



గుర్రం పరుగు పోటీలను ప్రారంభిస్తున్న బండారు

ఉచిత ఇసుకకు వేలం!

- వాహనానికి వెయ్యి రూపాయల చొప్పున వసూలు

-గ్రామ దేవతల పండగల ఖర్చులకు వినియోగం

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పక్కదారి పడుతోంది. గ్రామాభివృద్ధి పేరుతో మండలంలో వరహానది పరివాహక ప్రాంత సమీపం లో గొట్టువాడ, పందూరు గ్రామాల్లో ఇసుక వేలం పాటలు నిర్వహించారు. గొట్టువాడ గ్రామానికి గతంలో 18.40 లక్షలకు వేలంపాట నిర్వహించగా గడిచిన రెండు రోజుల క్రితం పొందూరు గ్రామానికి 22.50 లక్షలకు వేలంపాట కైవశం చేసుకున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. గతంలో కూడా ఆయా గ్రామాలకు ఇసుక వేలంపాట నిర్వహించారు. గ్రామ అభివృద్ధి పేరుతో నిర్వహిస్తున్న ఈ వేలం పాటదారులు భారీ మొత్తంలో వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో ఉచిత ఇసుకకు డబ్బులు చెల్లించి తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కో వాహనానికి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో నిర్మాణదారులు ఉచిత ఇసుక పక్కదారిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ



తరలిస్తున్న ఇసుక (ఫైల్ ఫొటో)

అభివృద్ధి పేరుతో వేలంపాటలు నిర్వహించి ఆసీళ్ల పేరుతో వసూలు చేసిన సొమ్ము కేవలం గ్రామ దేవతల పండగలకే ఖర్చు పెడుతూ ఉండటం విశేషం.


మాట్లాడుతున్న రూపాదేవి

11న విఎఒఎల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:విఓఎల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో విఓఎల క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో విఓఎలకు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రద్దు చేసిన గ్రేడింగ్ విధానం పునరుద్ధరణ, మగవారిని తొలగించాలనే ఆలోచన విరమించు కోవాలన్నారు. నేటికి మూడు నెలలు వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదని, ఇలా అయితే విఓఎలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, క్లస్టర్ నాయకులు త్రినాథ్, బుజ్జి, వెంకటలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


పూర్తయిన సిమెంట్ రోడ్డు

రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మాడ వీధుల్లో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆర్థిక సహాయంతో ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కంపెనీ సి ఎస్ ఆర్ నిధుల నుండి సుమారుగా 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 650 మీటర్ల సిమెంట్ రోడ్డు పనులు చేపట్టారు. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు.ఈ సందర్భంగా వెంకన్న ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేపట్టినందుకుగాను కంపెనీ యాజమాన్యానికి, కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాడవీధుల్లో గల రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు స్వామివారి తిరి వీధి వాహన సేవలు, స్వామివారి రథం లాగేటప్పుడు రోడ్డు సక్రమంగా లేకపోవడం వలన పడుతున్న ఇబ్బందులను హెూం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఈ మేరకు ఆమె స్పందించి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడడం జరిగిందన్నారు. హెటిరో ఆధ్వర్యంలో పటిష్టంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం : కెవిపిఎస్

ప్రజాశక్తి-రోలుగుంట:ఇటీవల విడుదల చేసిన రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం చేశారని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రకారం రూ.35వేల కోట్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ రూ.20వేలు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సంక్షేమ పథకాలు 29 పథకాలు గత ప్రభుత్వం రద్దు చేసిందని, అధికారంలోకి వస్తే పథకాలన్నీ అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ పథకాలను పునరుద్ధరించలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకం, ఎస్సీ నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఆటోలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని వాటి ఊసెత్తలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ 29 పథకాలు అమలు చేయాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు 35 వేల కోట్లు కేటాయించి ఎస్సీ ఎస్టీ వార్డులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

నర్సీపట్నంలో రాక్షస పాలన

-మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రమేయంతో నర్సీపట్నంలో రాక్షస పాలన సాగుతుందనిమాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. వైసీపీ టౌన్ యూత్ అధ్యక్షులు అల్లంపల్లి ఈశ్వరరావును పోలీసులు అరెస్టు చేయడంపై తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, అల్లంపల్లి ఈశ్వరరావుపై తప్పుడు కేసు బనాయించడమే కాకుండా 420 కేసు పెట్టి దుర్మార్గపు పాలనను స్పీకర్ అయ్యన్న చేస్తున్నారని విమర్శించారు. ఉన్నత స్థానంలో ఉన్న అయ్యన్న ఈ విధమైన చిల్లర రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు. పెద్ద స్థాయిలో ఉన్న వ్యక్తికి గౌరవించే స్థాయి, సంస్కారం తమకు ఉందన్నారు. ఈశ్వరరావుపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపిస్తున్నామని కొందరు శునకానందం పొందుతున్నారని, అయితే రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు వడ్డీ, చక్రవడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పారు. అల్లంపల్లి ఈశ్వరరావుపై పెట్టిన కేసులకు ఒక్క ఆధారం కూడా లేదన్నారు. కేవలం స్పీకర్ ఒత్తిడి వల్లే డీఎస్పీ రంగంలోకి దిగి తప్పుడు కేసులు పెట్టారని దుయ్య బట్టారు. నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొత్త సంస్కృతికి తెర లేపారన్నారు. మరోక నాలుగేళ్లలో తాము అధికారంలోకి వస్తామని, తప్పుడు కేసులు పెట్టిన అధికారులతో సహా అందరిని న్యాయస్థానం ముందు నిలబెడతామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న గణేష్

ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకున్న బావ, బామ్మర్ది

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామానికి చెందిన బావ – బామ్మర్ది ఎస్ఐలుగా ట్రెనింగ్ పూర్తి చేసుకొని పోస్టింగ్ కు సిద్ధంగా ఉన్నారు. గ్రామంలో సామాన్య రైతు కుటుంబానికి చెందిన పులకండం నాని, కొరసాల దుర్గ ప్రసాద్‌లు 2024 ఫిబ్రవరిలో వీరు ఎంపిక య్యారు. అదే నెలలో ఫిబ్రవరి 25న అనంతపు రంలో (పిటిసి) పోలీస్ శిక్షణ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కు హాజరైయ్యారు. 52 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మార్చి 1 న శిక్షణ పూర్తి చేసుకున్నారు. పోస్టింగ్ కోసం విశాఖ రేంజ్ డిఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు వారు వివరించారు.. పులకండం నాని తండ్రి వరహాలబాబు సాధారణ రైతు..ఆయన కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా కుమార్తె శ్యామల కూడా తెలంగాణ పోలీస్ శాఖ లో విధులు నిర్వహిస్తూన్నారు.నాని ఇంటర్ నుంచి చదువు లో మెరిట్ విద్యార్థిగా ఉంటూ చదువు కొనసాగిం చారు.పోలీస్ శాఖ లో ఉద్యోగం పొందారు..


శిక్షణ పూర్తి చేసుకున్న నాని, దుర్గా ప్రసాద్

కొరసాల దుర్గా ప్రసాద్ తండ్రి ప్రసాద్ చిన్న తనం లో మృతి చెందారు. తన సోదరుడు అంజి బాబు ప్రోత్సాహం తో చిన్న తనం నుంచి చదువులో ప్రతిభ కనబర్చి పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించారు. పి పొన్నవోలు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఒకేసారి ఎస్ఐలుగా విధుల్లో చేరడంతో ఆ గ్రామస్థులతో పాటు మండల వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తూన్నారు...

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం



ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో అంతుచిక్కని వ్యాధుల బారిన పడిన కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నక్కపల్లి, ఉపమాక, వేంపాడు, చందనాడ తదితర గ్రామాల్లో వ్యాధులకు గురైన కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. ఉపమాక గ్రామంలో ఇటీవల పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సుమారుగా 10 మందిపై దాడి చేసింది. కుక్కకాటుకు గురైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. నక్కపల్లి లో పదివేల రూపాయలు విలువైన రెండు గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. పలుచోట్ల పిచ్చికుక్కలు, వ్యాధులకు గురైన కుక్కలు పాదచారులను కరవడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులకు గురైన కుక్కలు కరవడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వీధుల్లో ఆడుకునే పిల్లలపై కుక్కలు దాడులు చేస్తాయన్న భయంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైకిల్, బైక్ లపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. మేకలు, గొర్రెలు, పశువులు, కోళ్ల పై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయి.అధికారులు స్పందించి కుక్కలు నిర్మూలనపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


చేపడుతున్న ప్రహరీ పనులు

పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో 35 లక్షలతో పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు మంజూరు అయినట్లు సర్వ శిక్ష అభియాన్ ఇంజనీర్ మూర్తి తెలిపారు. మండలంలో వెంకటాపురంకు 8.7 లక్షలు, కోటవురట్ల, గవరపేట7.83 లక్షలు, జల్లూరు 8.7 లక్షలు, తిమ్మాపురం 6.53 లక్షలు, బాలికల పాఠశాల4.0 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. అదేవిధంగా గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు 30 లక్షలు, వెంకటాపురంకు 30 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు, దీంతో ఆయా ప్రాంత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

1/70 చట్టం అమలుపై

అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి-పాడేరు : ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 6, 7 తేదీల్లో ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు ఆదివారం పాడేరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్ణయించింది. చట్ట సవరణలపై రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఐక్యవేదిక నిర్వహించిన 48 గంటల బంద్ పై సీఎం నారా చంద్రబాబునాయుడు స్పందించి 1/70 చట్టం రద్దు చేసే ఆలోచన లేదని ఎక్స్ వేదికగా ప్రకటించడం హర్షిస్తున్నామన్నారు. మరోవైపు ఆదివాసి ప్రాంతంలో ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసి ప్రాంతం అడవులంతా అధాని, అంబానీలకు కట్టబెట్టి ఆదివాసులను నిర్వాసితులు చేసే కుట్ర జరుగుతోందని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 1/70 చట్టంపై అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమైన ప్రకటన చేయాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, బూడిద చిట్టిబాబు, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాలలో జీవో 3 కనీసం ప్రస్తావన చేయలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీవో 3 కు చట్టబద్ధత కల్పిస్తామని, ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులకు ఉద్యోగాలు ఉండేలా చూస్తామని అరకు సభలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారని గుర్తు చేశారు. .ఈ సమావేశంలో నాయకులు ఆర్.మల్లమ్మ అరుణ, శ్రీలత, రాజశేఖర్ చిన్నారావు, రాజు, భాను సిహెచ్ రావు, చంటిబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.


చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. అనంతరం నీతి కథలు చదివించి వాటిలోని నీతిని వివరించారు. అనంతరం గ్రంథాలయాధికారి మాట్లాడుతూ విద్యార్థులు తరచూ గ్రంథాలయాలకు రావాలని చెప్పారు. గ్రంథాలయాలతో విజ్ఞానం పెరుగుతుందని వివరించారు.